


అగ్గిపెట్టెల్లాంటి భవంతులలో కృత్రిమ గాలులను పీల్చి పీల్చి వెగటుపుట్టిన పట్టణవాసులకు అందుబాటులోవున్న పార్కులే వరప్రసాదం.

గుంటూరు సిటీకి ఔట్‌స్కర్ట్స్‌లో వున్న మానససరోవరం అలాంటిదే. యాంత్రిక జీవనంతో మొఖం మొత్తిన నగరవాసులను అందమైన సాయం సమయాన అక్కున చేర్చుకుని, తన సహజ సోయగంతో అలరిస్తూ వుంటుంది మానస సరోవరం. ముఖ్యంగా కుర్రకారుని షికారుకి ఆహ్వానిస్తూ వుంటుంది.

చూపుకు అందనంత దూరంలోవున్న చెట్లవైపు యువతీయువకులు జంటలు జంటలుగా సాగిపోతూ వున్నారు. అప్పుడే మెయిన్ గేటు నుండి లోనికి ప్రవేశించిన ప్రమోద కళ్లు నలుదిక్కులా వెతకడం ప్రారంభించాయి. ఒక్కసారి కలియతిరిగి, మొదలుపెట్టిన స్థానానికే వచ్చి చేరాయి.

ఆమెని నిస్సత్తువ ఆవరించింది. ఓ నిట్టూర్పు విడిచింది. ఓ చెట్టు క్రింద కూర్చుని ఎదురుచూస్తోంది. ఇష్టమైన వారికోసం ఎదురుచూడటంలో ఆనందం వుంది. కాలం గడిచే కొద్దీ ప్రమోదలో ఆందోళన మొదలయింది.

"ఇంతకీ కార్తీక్ వస్తాడా? రాడా?"

ఒకవేళ రాకపోతే...?

ఆమె పెదవులు వణికాయి. ముచ్చెమటలు పట్టాయి.

"ఈ జీవితం ఇంతటితో ముగియవలసిందేనా?" శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తోంది.

ఒక దృఢమైన నిర్ణయానికి వచ్చిన దానిలా లేచి నిలబడింది. హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి సెల్ తీసి టైం చూసుకుంది. కార్తీక్‌కి తను ఇచ్చిన టైమ్ ఇంకా అయిదు నిమిషాలు వుంది. కళ్లు మెయిన్ గేట్‌వైపు ఆశగా, ఆత్రంగా చూస్తున్నాయ్ కార్తీక్ రాక కోసం. క్షణం ఎంతో భారంగా గడుస్తోంది. సెల్ తీసి మెసేజెస్‌లో సెంట్ ఐటమ్స్‌ని ఓపెన్ చేసింది. కార్తీక్‌కి తను పంపిన మెసేజ్‌ని మరోసారి చదువుకుంది.


"సాయంత్రం ఐదు గంటలకు మానససరోవరంకి రా. రాకుంటే నేను ఆత్మహత్య చేసుకుంటా" ఇదీ మెసేజ్ సారాంశం.

ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. కార్తీక్ రాడేమో అన్న అనుమానం బలపడసాగింది. అవమానంతో కూడిన ఈ నిరీక్షణ మరింత బాధగా వుంది. గతం ఒక్కసారి కళ్లముందు కదలాడింది.

* * *

సిటీలో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌ని నిర్వహి

నాగిశెట్టి



స్తున్నాడు కార్తీక్. మూడు పదుల వయసు. చక్కని శరీర ధారుద్యం. ఎదుటివారిని ఇట్టే ఆకర్షించగల ముఖవర్చస్సు కార్తీక్ సొంతం.

రెండేళ్ల క్రితం కంప్యూటర్ శిక్షణ కోసం ఇన్‌స్టిట్యూట్‌లో చేరింది ప్రమోద. తొలిచూపు లోనే ప్రేమలో పడింది. కాలేజి అయినా మానే దికాని, కంప్యూటర్ క్లాస్‌ని మాత్రం మిస్సయ్యేది కాదు. అరగంట ముందే వచ్చికూర్చునేది. మొదట్లో "సిన్సియర్ స్టూడెంట్ ప్రమోద" అను కున్నాడు కార్తీక్. తరువాత తరువాత అర్థ మయింది కార్తీక్‌కి... ప్రమోద సిన్సియారిటీకి కారణమేమిటో.

ఆరోజు రానే వచ్చింది.

కార్తీక్‌తో తన ప్రేమను ప్రపోజ్ చేసింది ప్రమోద.

సున్నితంగా తిరస్కరించాడు కార్తీక్.

టీనేజ్ దూకుడు నిర్ణయం తీసుకోవద్దని హెచ్చరించాడు. స్టడీస్‌పై కాన్సన్‌ట్రేట్ చేయమ ని హితబోధ చేశాడు. ఎంత చెప్పినా ప్రమోద తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

మరోసారి ప్రపోజ్ చేసింది. ఈసారి సీరి యస్‌గానే వార్నింగ్ ఇచ్చాడు కార్తీక్. అయినా పట్టువదలని విక్రమార్కునిలా వెంటపడుతూనే వుంది. కార్తీక్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోం ది.

గుండెదడ ఎక్కువయింది.

డెడ్‌లైన్...

తన ప్రేమను సాఫల్యం చేసుకోవడానికి కార్తీక్‌కి డెడ్‌లైన్ విధించింది ప్రమోద. తనకది జీవన్మరణ సమస్య. ఉద్విగ్న క్షణాలవి.

అప్రయత్నంగానే ఆమె చూపులు ఒకచోట నిలిచిపోయాయ్.

"ఔను... కార్తీకే"

రాడేమో అనుకున్న కార్తీక్ మానససరోవరం సింహద్వారం నుండి లోనికి ప్రవేశిస్తున్నాడు. రాజసం ఉట్టి పడుతోంది. ఆ రాజసమే తనను ఇంతదూరం లాక్కొచ్చింది. ఆనందంతో చూస్తూ ఉండిపోయింది. కార్తీక్ దగ్గరికి వచ్చినది కూడా గమనించనంత అచేతనంగా ఉండిపోయింది.

'ప్రమోదా' అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది.

ఇద్దరూ దూరంగా వున్న చెట్లవైపు నడుస్తున్నారు. మౌనం రాజ్యమేలుతోంది.

"ప్రమోదా! ఏమిటీ పిచ్చి పని? ఎందుకు ఇలా చేస్తున్నావ్?" ప్రశ్నించాడు కార్తీక్.

"ఔను... నాది ప్రేమ పిచ్చి. నీవు లేకుండా నేను బ్రతకలేను"

"ఎంతచెప్పినా వినవేంటి? నీ వయస్సు కెరీర్ మీద దృష్టి పెట్టాల్సిన వయస్సు"

"కానీ నా మనస్సు నువ్వే కావాలంటోంది"

"ప్లీజ్, ప్రమోదా! విను... నేను నిన్ను ప్రేమించే స్థితిలో లేను" బ్రతిమాలుతున్నట్లుగా చెప్పాడు కార్తీక్.

"అదేనా నీ నిర్ణయం?" దృఢంగా పలికింది ప్రమోద గొంతు.

"ఔను!... నన్ను మర్చిపో" అన్నాడు కార్తీక్.

వెంటనే హ్యాండ్ బ్యాగ్‌లో వున్న స్లీపింగ్ టాబ్లెట్స్ తీసుకుని ఒక్కసారిగా మింగబోయింది ప్రమోద. అది గమనించిన కార్తీక్ టాబ్లెట్స్‌ని చేత్తోనెట్టేశాడు. చెంప చెళ్లుమనిపించాడు.

కొంచెం దూరంగా సంచరిస్తున్న కొన్ని జంటలు ఒక్కసారిగా వీరివైపు చూసాయి.

ప్రమోదను చెయ్యిపట్టుకుని లాక్కుపోతున్నాడు కార్తీక్. ఆవేశంతో ఊగిపోతున్నాడు.

అవమానభారంతో ఎర్రబడిన ప్రమోద కళ్లు కన్నీరు కారుస్తున్నాయి.

బండి స్టార్ట్ చేసి, "రా... ఎక్కు" అని వెనుక కూర్చోబెట్టుకున్నాడు కార్తీక్.

బండి సిటీవైపు దూసుకుపోతోంది.

కాలం మౌనంగా సాగుతోంది.

బండి ఓ ఇంటి ముందు ఆపాడు కార్తీక్.

ప్రమోదను చెయ్యిపట్టుకుని వేగంగా లోపలికి తీసుకుపోయాడు. ఎదురుగా ఓ అందమైన అమ్మాయి...

ఎంత అందమంటే?... అందానికే ఈర్ష్య కలిగేటంత.

చూస్తూ ఉండిపోయింది ప్రమోద.

ఆమె మోములో భావోద్వేగాలు లేవు. అచేతనంగా చూస్తూ వుంది. "ఎవరు ఈమె?" ప్రమోదకు ఏమీ అర్థంకాలేదు.


"ఈమె... ఈమె పేరు సువర్ణ" కార్తీక్ చెప్పటం ప్రారంభించాడు. మా కాలేజిలో నాకు జూనియర్.

ఆమె నడచి వస్తూంటే కాలేజి మొత్తం నోరు తెరిచి ఆమె వైపే చూస్తూ వుండేది.

తొలిచూపులోనే ప్రేమలో పడ్డాను.

నా ప్రేమను తిరస్కరించింది.

అవమానానికి ఆవేశం తోడై నాకు దక్కనిది ఎవ్వరికీ దక్కకూడదనే మూర్ఖపు ఆలోచనతో




ఆమెపై కత్తితో దాడిచేసి చంపబోయాను. ఆ దాడిలో సువర్ణ షాక్‌కి గురయ్యింది. చావు తప్పించుకుంది గానీ ఇలా అచేతనావస్థలో ఉండిపోయింది. మాటా, పలుకూ లేకుండా...

కార్తీక్ చెప్పుకుపోతూనే వున్నాడు. సువర్ణ ఇవేమీ పట్టనట్టు తనలోకంలో తానుంది. ఆసుపత్రిలో చేర్చినా ఫలితం లేకుండా పోయింది. సువర్ణ తల్లిదండ్రులు నాపై ఎలాంటి కేసూ పెట్టలేదు.

"నువ్వు ప్రేమించిన అమ్మాయిని నువ్వే చూసుకో" అని నా వద్ద వదిలి వెళ్లిపోయారు.

నేను చేసిన వెధవ పనికి అమ్మానాన్నలు నన్ను దగ్గరకు రానీయలేదు.

ఆకలి అంటే తెలియని నేను ఆ రోజున వీధిన పడ్డాను. "నేనే కాదు నా సువర్ణనూ బతికించుకోవాలి..." మనుగడ కోసం పోరాటం ప్రారంభించాను.

"ఇదిగో... ఇప్పుడిలా... నీ ముందు"

"ఓ నిండు జీవితాన్ని బలితీసుకున్న నేను క్షమార్హుడను కాదు ప్రమోదా! క్షమార్హుడను కాదు." పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు కార్తీక్.

ప్రమోద నిశ్చలంగా చూస్తూ వుంది.

ప్రమోద వయస్సు వేడికి పుట్టిన ప్రేమ పొర కరిగి కన్నీరై కారిపోయింది.

ఇప్పుడు ఆమె మనస్సు అకాలవర్షం వచ్చి వెళ్లిన తరువాత నేలలా నిర్మలంగా వుంది.

సువర్ణపై జాలి, ప్రేమ రెండూ కలిగాయి ప్రమోదకు. "ప్రేమంటే చంపడమో, చావడమో కాదు. తను బ్రతుకుతూ, ఎదుటివారిని బ్రతకనివ్వటం" అన్న కార్తీక్ మాటలు పదే పదే విని పిస్తూ వున్నాయ్ ప్రమోదకు.

"ఓ తొందరపాటు నిర్ణయం ఖరీదు రెండు జీవితాల"నే విషయం ఆమెకి అర్థమైంది. ●